
ప్రజాశక్తి
మంగళవారం 17 డిసెంబర్ 2024
5
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు





నగరంలో దొంగలు హల్‌చల్..!

బీహార్ గ్యాంగ్‌గా అనుమానం

ప్రజాశక్తి -నెల్లూరు ప్రతినిధి :నెల్లూరు నగరంలో శనివారం రాత్రి దొంగలు హల్‌చల్ చేశారు. వారు రాత్రి బీహార్ గ్యాంగ్‌గా అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ సంఘటనతో ఒక్కసారి నగరవాసులు భయపడుతున్నారు. ముందుగా రెడ్డి, నిర్మలించి దొంగల నానికి పాల్పడినట్లు సమాచారం. హరనాథపురం, మూడో వీధి గురునిలయం అపార్ట్‌మెంట్, గోమతి స్ట్రూల్ బ్రిడ్జి సమీపంలోని ఓ అపార్ట్‌మెంట్‌లో దొంగల పడ్డారు. వాచ్‌మెన్ రూమ్‌కు గొళ్లెం పెట్టి ఇంట్లో చొరబడి బీరువాలు పగుల కొట్టి 250 గ్రాముల బంగారం చోరీ చేసినట్లు సమాచారం. చాకచక్యంగా ఆయుధాలతో ప్రవేశించి చేసినట్లు వీడియో రికార్డుల్లో కనిపించింది. పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



సిలికా మైన్స్‌పై పెద్దల కన్ను..

సింహపురిలో మైనింగ్ దందా రోజు రోజుకు పెరుగుతోంది.. సైదాపురం తెల్లరాయి వివాదం జరుగుతోన్న క్రమంలో ఉమ్మడి నెల్లూరు జిల్లాలో చిల్లకూరు, కోట మండలాల్లో ఉన్న సిలికా మైన్స్ తెరమీదకు వస్తోంది. ఇక్కడ దొరికే అరుదైన సిలికాను మంచి గిరాకీ ఉంది. ఇక్కడ రాజకీయ నేతలు, బడా వ్యాపారులు, ఇప్పటికే భారీగా తవ్వేశారు. వైసిపి ప్రభుత్వంలో కేవలం మూడేళ్ల కాలంలో సుమారు రూ. 5 వేల కోట్లు విలువైన సంపదను కొల్లకొట్టినట్లు విమర్శలున్నాయి. కొత్త ప్రభుత్వంలో తమ భూములు తమకు వస్తాయని భావించిన లీజు దారులు ఇప్పుడు లబోదిబోమంటున్నారు. కొందరు బడా వ్యాపారులు సిలికా మైన్స్‌పై కన్నేసినట్లు సమాచారం. ఎలాగైనా వీటిని దక్కించుకొని భారీగా దోపిడీ చేయడానికి సన్నాహాలు చేస్తున్నట్లు తెలిసింది. యువగళం పాదయాత్రలో నారా లోకేష్ ఇచ్చిన మాట నిలబెట్టుకొని తమ భూములు తమకు ఇవ్వాలని లీజుదారులు డిమాండ్ చేస్తున్నారు.

- ○కూటమి ప్రభుత్వంలో వ్యూహరచన
- ○వైసిపి ప్రభుత్వంలో రూ 5 వేల కోట్లు దోపిడీ
- ○మైన్స్ లీజుదారులు లబోదిబో..
- ○నారా లోకేష్ మాట నిలబెట్టుకునేనా..?

ప్రజాశక్తి -నెల్లూరు ప్రతినిధి : సిలికా మైన్స్‌కు ఇప్పుడు మరింత డిమాండ్ పెరిగింది. ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని చిల్లకూరు, కోట ప్రాంతాల్లో ఈ మైన్స్ పెద్ద ఎత్తున ఉంది. సుమారు 1,000 ఎకరాల్లో మైన్స్ విస్తరించింది. ఎస్‌సి, ఎస్‌టి అసైన్‌మెంట్ భూముల్లోనూ అనేక మంది పెద్దలకు ఇక్కడ నుంచి భారీగా మైన్స్ ఉన్నాయి. ఇక్కడ నుంచి ప్రతి రోజు 500 నుంచి 600 లారీలు ఇతర ప్రాంతాలకు రవాణా జరుగుతోంది. గ్లాస్‌లు, కాస్టింగ్ వీల్స్, టెక్స్‌మోమీటర్లు, మెల్టింగ్ వస్తువులు, కార్ గ్లాసులు, సీలింగ్ షీట్లు, రైల్వే వీల్స్ ఫ్యాక్టరీల్లో సిలికా వినియోగం అధికంగా ఉంది. ఏన్నో ఏళ్ల నుంచి వ్యాపారాలు సాగుతున్నాయి. ఇక్కడ మైనింగ్ మాఫియానే నడిచేది. చిన్న సన్నకారు రైతులకు తక్కువ చెల్లించి పెద్దలు జెసిబిలు, ఇటాచీలతో తవ్వేవారు. ఇక్కడ చిన్న రైతులకు టన్నుకు రూ 100 చెల్లించి మార్కెట్లో టన్ను రూ 1,450కి విక్రయించేవారు. కొందరు రైతులకు ఎకరానికి రూ 3 నుంచి రూ 5 లక్షలు చెల్లించి తవ్వకాలు చేశారు. తవ్వవు చెల్లించి తవ్వకాలు జరిపేవారు.



చింతవరంలో మైన్స్ దృశ్యం

వైసిపి ప్రభుత్వంలో రూ 5 వేల కోట్లు దోపిడీ

2019 వైసిపి అధికారంలోకి వచ్చాక సిలికా మైన్స్‌పై పెద్దల కన్నుపడింది. ఉన్నది వరకు మైన్స్ చేసుకున్న వారికి రూ 317 కోట్లు పెనాల్టీ విధించినట్లు తెలిసింది. మైన్స్ తమకు ఇస్తారా ? లేదా అంటూ భయభ్రాంతులకు గురి చేయడంతో విధిలేని పరిస్థితుల్లో మైన్ యజమానులు వైసిపికి చెందిన వ్యక్తులకు అప్పగించినట్లు తెలిసింది. విజయవాడలోని వైసిపి కీలక నేత, చెన్నైయ్‌కు చెందిన మరో వ్యక్తి, గూడూ రుకు చెందిన మహిళ, మైని ంగ్ అధికారులు ఇందులో కీలకంగా ఉన్నట్లు సమా చారం. రాజధాని కేం ద్రంగా 2020 నుంచి 2023 సిలికా దందా సాగినట్లు తెలుస్తోంది. అప్పటి ప్రభుత్వ పెద్దలు మైన్స్ లీజ్‌దారులను బెదిరించి, భయపెట్టి మొత్తం వ్యాపారం నడిపారని సమాచారం. వైసిపి ప్రభుత్వానికి రూ 522 కోట్లు రాయల్టీ, రూ 167 కోట్లు జిఎస్‌టి ఎగనామం పెట్టినట్లు తెలిసింది. మూడేళ్ల కాలంలో రూ 4,455 కోట్లు, ఎన్నికలకు ముందు ఆరునెలల మరో రూ 500 కోట్లు దోపిడి చేశారనే సమాచారం. ఈ విషయాన్ని ఇప్పటికే కొందరు సిబిఐకి ఫిర్యాదు చేశారు. గత ప్రభుత్వంలో బిక్కు బిక్కుగా మైన్స్ యజమానులు కాలం గడిపారు..

సిలీకా మైన్స్‌పై పెద్దల కన్ను..!

వైసిపి ప్రభుత్వం వెళ్లి టిడిపి ప్రభుత్వం వస్తే తమ కష్టాలు తీరుతాయని భావించిన చిన్న చిన్న రైతులు, లీజు దారులకు మళ్లీ గబులు ప్రారంభమైయింది. ఈ ప్రాంతంలో 80 మైన్స్ ఉన్నాయి. సుమారు వెయ్యి ఎకరాలున్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చాకా మళ్లీ అదే తంతు సాగుతున్నట్లు సమాచారం. ఇప్పుడు లీజ్‌దారులకు పెనాల్టీపేరుతో భయపెడుతున్నట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో ఓ ప్రముఖ విద్యా సంస్థలకు చెందిన వ్యక్తి, ఒకప్పుడు పోర్టు నిర్వాహణలో కీలకంగా ఉన్న మరో వ్యక్తి, హైదరాబాద్‌కు చెందిన ఇద్దరు వ్యక్తుల కన్ను మైన్స్‌పై పడినట్లు తెలుస్తోంది. ఇక్కడకు వచ్చి ఒరిజనల్ లీజుదారుల నుంచి మళ్లీ బెదిరించి మైన్స్‌లాక్కునే పనిలో ఉన్నట్లు సమాచారం. కూటమిలోని కొందరు వ్యక్తుల సహకారంతో దక్కించు కోవడానికి వ్యూహరచన చేస్తున్నట్లు సమాచారం. ఇదే జరిగితే మైన్ లీజుదారులు ఆత్మహత్య శరణ్యమని వాపోతున్నారు.

నారా లోకేష్ మాట నిలబెట్టుకునేనా..?

సిలికా మైన్స్‌లో భారీ అవినీతి, అక్రమాలు జరిగినట్లు నారా లోకేష్‌కు యువగళం పాదయాత్రలో లీజుదారులు మొరపెట్టుకున్నారు. “మీరు వైసిపి వారికి భయపడి వందల రాసి ఇవ్వద్దు. మన ప్రభుత్వం వస్తే 'మీ మైన్స్ మీకే ఇప్పిస్తా...10 ఏళ్ల లీజ్ టైమ్ పెంచుతాం.. రాయల్టీ తగ్గిస్తాం...పెనాల్టీలు వేయం” అంటూ భరోసా ఇచ్చారు. ఏప్రిల్‌లో జరిగిన సమావేశంలోనూ ఇదే మాటఇచ్చారు. ఇప్పుడు కొందరు వ్యక్తులు టన్నుకు రూ. 200 ఇస్తామని బేరం పెడుతున్నారు. మార్కెట్‌లో టన్ను రూ 1650కి విక్రయిస్తున్నట్లు సమాచారం. టిడిపి ప్రభుత్వం వస్తే తమ మైన్స్ తమకు వస్తాయని ఆశపడ్డ వారికి ఇప్పుడు నిరాశే మిగిలినట్లు కనిపిస్తోంది. తమ మైన్స్ తమకు ఇప్పించాలని, వైసిపి ప్రభుత్వం చేసిన ఆరాచకం కూటమి ప్రభుత్వం చేయకూడదని స్థానిక మైన్స్ దారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నారా లోకేష్ పాదయాత్రలో ఇచ్చిన మాట నిలబెట్టుకుంటారా లేదా పెద్దలకు తలొగ్గుతారా చూడాలి..!



యూరియా సరఫరా చేయాలి

వెంకటాచలం :రైతులకు సకాలంలో యూరియా సరఫరా చేయాలని వైసిపి నాయకులు కోరారు. ఈ మేరకు వారు సోమవారం తహశీల్దార్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు.మాజీ జెడ్‌పిటిసి మందల వెంకట శేషయ్య మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రంలో యూరియా సకాలంలో దొరకక రైతులు ఇబ్బంది పడుతున్నారన్నారు.రైతుల విషయంలో రాజకీయాలు చేయడం సరికాదన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-కందుకూరు : కందుకూరు పురపాలక సంఘ కార్యాలయములో సోమవారం నిర్వహించిన ప్రజా పిర్యాధులు, డయల్ యువర్ కమిషనరు కార్యక్రమానికి 6 అర్జీలు వచ్చినట్లు మున్సిపల్ కమిషనరు కె. అనూష తెలిపారు. సెక్షన్స్ హెడ్స్ పాల్గొన్నారు. ప్రతి సోమవారం జరిగే ప్రజా పిర్యాధుల కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ కె. అనూష పట్టణ ప్రజలను కోరారు. 9177700267 నెంబర్‌కు సంప్రదించి సమస్యలను తెలియజేయవచ్చన్నారు.

ఘనంగా విజయ్ దివస్

నెల్లూరు :10 ఆంధ్ర నేవల్ యూనిట్ ఎన్‌సిసి నెల్లూరు లెఫ్టినెంట్ కమాండర్ గణేష్ గొదన్గవే ఆదేశాల మేరకు ఎన్సిసి సెకండ్ ఆఫీసర్ గుండాల నరేంద్రబాబు ఆధ్వర్యంలో జాతీయ పతాకాలను కె.ఎన్.ఆర్. నగర పాలక ఉన్నత పాఠశాల ఎన్‌సిసి కేడేట్లు చేతబూని నినాదాలు చేశారు. గుండాల నరేంద్ర బాబు విజయ్ దివస్ ప్రాముఖ్యతను వివరించారు. ప్రధాన ఉపాధ్యాయులు ఎం. విజయ్ ప్రకాష్ రావు,ఎన్ సి సి కేడేట్లు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇనాం భూములను పేదలకు పంపిణీ చేయాలి

వ్య. కా. సం ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా

ప్రజాశక్తి-నెల్లూరు :ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ, తోటపల్లి గూడూరు మండల కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో పాపిరెడ్డిపాళెం గ్రామ రెవెన్యూ పరిధిలోని ప్రభుత్వ ఇనాం మిగుల భూమి 497,498 సర్వే నెంబర్లలో 12.5 ఎకరాల మిగులు భూమి ఉందని, ఆ భూమిని సాగు చేసుకుంటున్న నిరుపేదలకు పంపిణీ చేయాలని కోరుతూ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. సోమవారం జరిగిన ఈ ధర్నాలో ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఎం.పుల్లయ్య మాట్లాడారు. గడిచిన 4,5 ఏళ్ల నుంచి సకాలంలో వర్షాలు కురవకపోవడంతో నిరుపేదలు ఆ భూమిలో పంట సాగుబడి చేయలేకపోయారన్నారు. దీనిని అవకాశంగా తీసుకున్న వైసిపి నాయకులు ఆక్రమించుకోవాలన్న దురుద్దేశంతో ఆ భూమికి సంబంధించి నకిలీ పత్రాలను సృష్టించారన్నారు. ఆ రోజు వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు, పరిసర ప్రాంత వ్యవసాయ కార్మికులు అడ్డుకున్నారన్నారు. ఆ భూమిని నిరుపేదలకు నివాస స్థలాలుగా కేటాయించాలన్నారు. ప్రస్తుతం అధికార పార్టీకి సంబంధించిన ఆప్రాంత నాయకులు పేదలు ఇళ్లు వేసుకుని 450 కుటుంబాలు జీవనం సాగిస్తున్న ఆ భూమి తమదంటూ పోలీసులు, అధికార యంత్రాంగంతో ఆక్కడకు చేరుకోని ఆక్రమిం చుకొనేందుకు సిద్ధమౌతున్నారన్నారు. వాస్తవానికి ఆ భూమి ప్రభుత్వమిగులు భూమి అన్నారు. ఇనాం దారులు 70 ఏళ్ల కిందట వదిలేశారన్నారు. నాటి నుంచి ఆ భూమి ఖాళీగా ఉందన్నారు. నిటివసతి లేని ఆ భూమిని నిరుపేదలకు పంచాల్సింది పోయి, అధికార పార్టీ అండదండలతో ఆ భూమిని ఆక్రమించుకొనేందుకు ప్రయత్నాలు చేయడం సరికాదన్నారు. పాపిరెడ్డిపాళెం, ఇస్కపాళెం తదితర గ్రామాల్లో ఇళ్లు లేని నిరుపేదలకు ఆ భూమిని పంపిణీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు.ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు జొన్నలగడ్డ వెంకమరాజు మాట్లాడుతూ తోటపల్లి గూడూరు మండల పరిధిలోని ప్రభుత్వ భూమిని (ఇనాం భూమి) ఆ మండల పరిధిలో ఇళ్లులేని నిరుపేద కుటుంబాలకు ప్రభుత్వం పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఆలూరు తిరుపాలు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు పెద్దబ్బయ్య. టి పి గూడూరు మండల వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి పచ్చ మధు. సిపిఎం పార్టీ మండల కార్యదర్శి ఈపూరు లక్ష్మయ్య. టి పి గూడూరు సిపిఎం పార్టీ మండల కమిటీ సభ్యులు బండి శౌరి. మారు బోయిన రాజా. ఉంద్రాళ్ళ శీనయ్య. మోచర్ల రాధయ్య. వేగూరు వెంకయ్య. కాల్తీ రెడ్డి రమణమ్మ పాల్గొన్నారు.



అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ప్రాథమిక విద్యను బలోపేతం చేయాలి

ముగిసిన యుటిఎఫ్ స్వర్ణోత్సవ మహాసభ - 100 మందితో నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-నెల్లూరు :గత ప్రభుత్వం అనుసరించిన విధానాల వల్ల ప్రాథమిక విద్యను నిర్వీర్యమైందని, ప్రజా వ్యతిరేక నిర్ణయాలు తీసుకోవడం వల్ల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు మూతపడగా, కొన్ని ఏకోపాధ్యాయ పాఠశాలలుగా మారిపోయాయని యుటిఎఫ్ నాయకులు విమ ర్శించారు. నూతన ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చి ప్రాథమిక విద్యను బలోపేతం చేసేందుకు కృషి చేయాలని యుటిఎఫ్ సీనియర్ నాయకులు పిలుపు నిచ్చారు. నగరంలో రెండు రోజుల పాటు జరిగిన యుటిఎఫ్ స్వర్ణోత్సవ మహాసభ ముగింపు కార్యక్రమం సోమవారం రెండో రోజు మినిబైపాస్ రోడ్డులోని యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో నిర్వహించారు. రెండో రోజు కార్యక్రమాల్లో ముందుగా యూటిఎఫ్ జిల్లా కార్యాలయంలోని మూడో అంతస్తులో నిర్మించిన భవనాన్ని మాజీ విఠపు బాలసుబ్రహ్మణ్యం ప్రారంభించారు. అనంతరం ప్రజారోగ్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు డాక్టరు ఎం.వి.రమణయ్య ఆధ్వర్యంలో చక్కెర వ్యాధి నివారణపై అవగాహన కల్పించారు. ‘తీయ్యటి ముప్పు’ అనే హాస్యవల్లరి కార్యక్రమం నిర్వహించారు. ఈ మహాసభల్లో జివో నెంబరు 110 రద్దు చేయాలి, ప్రాథమిక విద్యను కాపాడాలి, ఉపాధ్యాయులకు బోధనేతర పనుల నుంచి తప్పించాలి, ప్రాథమిక విద్య మాతృబాషలోనే బోధన చేపట్టాలి, 12వ పిఆర్‌సిని తక్షణమే అమలు చేయాలి, సిపిఎస్ విధానం రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేయాలని తదితర 8 తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు.

యుటిఎఫ్ జిల్లా నూతన కమిటీ ఎన్నిక

యూటిఎఫ్ జిల్లా కార్యవర్గాన్ని వంద మంది సభ్యులతో ఎన్నుకున్నారు. యూటిఎఫ్ జిల్లా అధ్యక్షులుగా వి.వి.శేషులు, జిల్లా ప్రధాన కార్యదర్శిగా జి.వి.చలపతి శర్మ,గౌర వాధ్యక్షులుగా కె. వెంకటేశ్వర్లు, అసోసియేట్ అధ్యక్షులుగా ఎం.సి అచ్చయ్య, మహిళా అసోసియేట్ అధ్యక్షురాలిగా పి.సుభాషిణి, కోశాధికారిగా మురళీధర్‌రావులు ఎన్నికైనట్లు ప్రకటించారు. 21మందితో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి వర్గాన్ని,10 మందితో రాష్ట్ర కౌన్సిలర్ సభ్యులుగా, 7 మందితో ఆడిట్ కమిటీ,కుటుంబ సంక్షేమ సభ్యులుగా 8 మందిని ఎన్ను కున్నారు. రెండవ రోజు మహాసభల్లో యుటిఎఫ్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి కెఎస్ఎస్ ప్రసాద్, సీనియర్ నాయకులు మస్తానయ్య, బాబురెడ్డి, పరందామయ్య పాల్గొన్నారు.



జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వివి శేషులు, జివి చలపతి

బహుమతులు అందజేత

వెంకటాచలం :కాకుటూరులోని విక్రమ సింహపురి విశ్వవిద్యాలయ ఎన్ఎస్-ఎస్ విభాగం ఆధ్వర్యంలో అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు వర్ధంతి (ఆత్మార్పణ దినోత్సవాన్ని) పురస్కరించుకుని విద్యార్థినులకు వివిధ ప్రతిభా పోటీలు నిర్వహించారు. వక్తృత్వ, వ్యాసరచన, డిబేట్ వంటి పోటీలు నిర్వహించారు. విజేతలుగా నిలిచిన వారికి విశ్వవిద్యాలయ ఉపకు లపతి ఆచార్య ఎస్. విజయ భాస్కర రావు మంగళవారం బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన ఉపకులపతి మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు త్యాగాలు మరువలేనివన్నారు. రిజిస్ట్రార్ డా.కె. సునీత, ప్రిన్సిపాల్ ఆచార్య సి యెచ్ విజయ, యన్ ఎస్ ఎస్ సమన్వయ కర్త డా ఉదయ్ శంకర్ అల్లం, పి ఆర్ ఓ డాక్టర్ నీల మణికంఠ ఉన్నారు.

వృద్ధులకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి గుడ్లూరు రూరల్ :గుడ్లూరు మండలంలోని మూర్తింపేట గ్రామం, ఎస్‌టి కాలనీలో 50 మంది వద్దులకు చీరలు, దుప్పట్లను పీపుల్ హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ సంస్థ ప్రెసిడెంట్ తలకాయల ప్రభాకర్ ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ నిరుపేదలకు, వెనకబడిన వారికి సేవ చేయాలనే ఆశయంతో పీపుల్ హెల్పింగ్ హాండ్స్ సొసైటీ సంస్థను స్థాపించామన్నారు. దుప్పట్లు, చీరలను కందుకూరి కు చెందిన గోనుగుంట వెంకటేశ్వర్లు సేవా దక్పథంతో అందజేయడం అభినంద నీయమన్నారు.ట్రెజరర్ హేమలత, మాదేశ్, సంజయ్ ఉన్నారు.

పంచాయతీ స్థలాన్ని పరిరక్షించండి..

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు :ఆక్రమణకు గురైన పంచాయతీ స్థలాన్ని పరిరక్షించండి అని వ్యవసాయ కార్మిక సంఘం ప్రతినిధులు సోమవారం అధికారులకు వినతి పత్రం అందజేశారు. వరిగొండ పంచాయతీ పరిధిలో మహేంద్ర రెడ్డి నగర్ లే అవుట్ యాజమాన్యం 10 శాతం భూమిని ప్రజోపయోగం కోసం పంచాయతీకి రిజిస్టర్ చేసింది. ప్రస్తుతం ఆ స్థలాన్ని భానుప్రకాష్ రెడ్డి, శేఖర్ ఆక్రమించకునాక్కరని ఫిర్యాదులో పేర్కొన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మంగళం పుల్లయ్య, అధ్యక్షులు జొన్నలగడ్డ వెంకమరాజు, సిపిఎం మండల కార్యదర్శి ఇ. లక్ష్మయ్య, సిఐటియు మండల కార్యదర్శి మారుబోయిన రాజా, యు. సీనయ్య, వ్య.కాస మండల కార్యదర్శి పచ్చ మధు ఉన్నారు.

రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి : సిపిఎం

ప్రజాశక్తి -నెల్లూరు

సిపిఎం రాష్ట్ర 27వ మహాసభలు ఫిబ్రవరి 1,2, 3 తేదీలలో జిల్లాలో జరుగుతున్న నేపథ్యంలో ఆ మహాసభలను జయప్రదం చేసేందుకు సిపిఎం నెల్లూరు నగర కమిటీ ఆధ్వర్యంలో డాక్టర్ జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో సిపిఎం నగర విస్తత జనరల్ బాడీ సమావేశాన్ని నిర్వహించారు. నగరంలోని అనేక శాఖలు, ప్రజా సంఘాల నుండి అధిక సంఖ్యలో సిపిఎం శ్రేణులు హాజరయ్యారు. మాజీ శాసనమండలి సభ్యులు విఠపు బాలసుబ్రమణ్యం,సిపిఎం నెల్లూరు జిల్లా కార్యదర్శి మూలం రమేష్, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.మోహన్ రావులు హాజరై మాట్లాడారు. జిల్లాలో సిపిఎంప్రజా పోరాటాలు నడపడంలో రాష్ట్రంలోనే చరిత్ర కలిగి ఉందన్నారు. సారా వ్యతిరేక ఉద్యమం,భూ పోరాటాలు, ఇళ్ల స్థలాల పోరాటాలు, కూలి పోరాటాలు నడపడంలో రాష్ట్రంలో అందరికీ ఆదర్శంగా నిలిచినద న్నారు. ఈ జనరల్ బాడీ సమావేశానికి సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు జి నాగేశ్వర రావు సభాధ్యక్షత వహించారుఈ కార్యక్రమంలో సిపిఎం నెల్లూరు నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు నగర కార్యదర్శి వర్గ సభ్యులు షేక్ మస్తాన్ బి పి. సూర్యనారాయణ, ఖాయంబు శ్రీనివాసులు ఉన్నారు.



మాట్లాడుతున్న విటపు బాలసుబ్రమణ్యం

విరాళం అందజేత

ప్రజాశక్తి -గుడ్లూరు రూరల్ :గుడ్లూరు మండలం చెమిడిదపాడు బస్టాండు వద్ద నిర్మాణం లో ఉన్న పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయం నిర్మాణం కోసం కందుకూరు కు చెందిన నాగినేని కోటేశ్వరరావు, రేవతి దంపతులు శనివారం రూ. 27 వేల రూపాయల విరాళం అందించారు. ఆ మొత్తం చెక్కు ను నిర్వాహకులు కోటేశ్వరరావు గురుస్వామి అందజేశారు. ఆలయ నిర్మాణానికి సహకరిస్తున్న దాతలకు ట్రస్ట్ అధ్యక్షుడు ఆలూరి వెంకట హనుమంతరావు కతజ్ఞతలు తెలిపారు.

‘రాళ్లపాడు’ వద్ద రైతుల ఆందోళన

నీరు విడుదల చేయాలని కోరుతూ మరోసారి ధర్నా - నిరవధిక నిరాహార దీక్ష చేస్తామని హెచ్చరిక



రాళ్లపాడు వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

ప్రజాశక్తి - లింగసముద్రం : రాళ్లపాడు ప్రాజెక్టు కుడికాలువకు నీరువిడుదల చేయాలంటూ ఆయకట్టు రైతులు మరోసారి ఆందోళనకు దిగారు. సోమవారం కాలువ తూము దగ్గర చిన్నపవని నుంచి వచ్చిన రైతులతో పాటు మరికొందరు రోడ్డుకుపై ధర్నా చేశారు. దీంతో రాకపోకులకు తీవ్ర అంతరాయం కలిగింది. తూము విరిగిపడి 12 రోజులు గడుస్తున్నా సమస్యను పరిష్కరించి కాలువకు నీటిని విడుదల చేయకపోవడంపై రైతులకు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వరి నార్లు ముదిరి పోతున్నాయని, నీటిని విడుదల చేయడంలో అధికారులు ప్రదర్శించిన అలసత్వమే రైతుల పాలిట శాపంగా మారిందని రైతులు వాపోతున్నారు. కలెక్టర్ తక్షణమే స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు. ప్రతిరోజు అధికారులు మరమ్మత్తులు చేస్తున్నారే తప్ప పురోగతి లేదన్నారు. ప్రత్యామ్నాయ మార్గం ఆలోచించి కాలువకు నీరు విడుదల చేయాలని రైతులు డిమాండ్ చేశారు. తూము మరమ్మత్తు పనులను పరిశీలించేందుకు వచ్చిన ఎస్ ఈ వరలక్ష్మి రైతులకు సమాధానం చెప్పాలని, తక్షణమే తమకు న్యాయం చేయాలని ఆమె ముందు డిమాండ్ చేశారు. లేదంటే నిరవధిక నిరాహార దీక్ష చేస్తామని రైతులు హెచ్చరించారు.



ఎస్‌ఈతో మాట్లాడుతున్న దివి శివారాం

సమస్యను పరిష్కరించాలి : దివి శివరాం

గత ఐదేళ్ల నుంచి వరిసాగు కోసం ఎదురు చూస్తున్న రాళ్లపాడు రైతుల సమస్యను తక్షణమే పరిష్కరించాలని కందుకూరు నియోజకవర్గం అభివద్ధి మండలి చైర్మన్, మాజీ ఎంఎల్ఎ డాక్టర్ దివి. శివరాం సోమవారం డిమాండ్ చేశారు. రాళ్లపాడు ప్రాజెక్టు వద్ద ఆందోళన చేస్తున్న ఆందోళనలో పాల్గొన్న ఆయనరిజర్వాయరు మెయింటేనెన్స్ విషయంలో అధికారుల అలసత్వం పట్ల ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.ప్రాజెక్టు నిర్వాహణ పట్ల ముందు జాగ్రత్త, దూర దష్టి లేని కారణంగానే నేడు రాళ్లపాడు ప్రాజెక్టు పరిధి లోని 25 వేల ఎకరాలలో పంటల నష్టంజరిగే పరిస్థితి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

ఎట్టకేలకు ‘ నీరు విడుదల

తూము గోడ పగలకొట్టి 100 క్యూసెక్కులు నీరు విడుదల

కుడి కాలువ తూము గేటును తీసేందుకు అధికారులు చేసిన ప్రయత్నాలు విఫలం కావడంతో 12 రోజుల తర్వాత తూము లోపల గోడను పగులగొట్టి నీటిని సోమవారం సాయంత్రం కాలువకు విడుదల చేశారు. ఉదయం నుంచి తూము లోపల ఉన్న గోడను క్రషర్‌తో పగలకొట్టడం ప్రారంభించారు. తూము గేటు విరిగి పది రోజులు గడుస్తున్నా ఎలాంటి పురోగతి లేకపోవడంతో రైతులు తీవ్ర ఆందోళనకు దిగారు.దీంతో ఉన్నతాధికారులతో ప్రాజెక్ట్ అధికారులు సంప్రదింపులు జరిపారు. గేటును పగలకొట్టేందుకు ఉన్నతాధికారుల నుంచి అనుమతులు వచ్చిన వెంటనే పని ప్రారంభించారు.దీంతో ప్రస్తుతం కుడి కాలువకు 80 నుండి 100 క్యూసెక్కులు నీరు పోతుందని అధికారులు చెప్పారు. త్వరలోనే గేటు సమస్యకు పరిష్కారం లబి స్తుందన్నారు. ఎస్ ఈ వరలక్ష్మి ప్రాజెక్టు దగ్గరే ఉండి కాలువకు నీటిని విడుదల చేసేలా చేస్తున్నా పనులను పర్యవేక్షించారు. నీరు విడుదల కోసం గత పది రోజుల నుండి ప్రాజెక్ట్ వద్దనే ఉంటూ ప్రాజెక్టు డిఈ వెంకటేశ్వరరావు, ఏఈ లు చంద్రమౌళి, మనోహర్, ప్రాజెక్టు సిబ్బంది కష్టపడి చేశారు.



తూము గోడను పగల కొడుతున్న దశ్యం

నీరు విడుదలకు ప్రత్యామ్నాయ మార్గాలు చూడాలి : సిపిఎం

ప్రజాశక్తి-కందుకూరు :రాళ్లపాడు ఆయుకట్టు పరిధిలోని వరి నాట్లు ఎండిపోకుండా ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా నీరు అందించి రైతులను ఆదుకోవాలని సిపిఎం గుడ్లూరు , కందుకూరు ,ఉలవపాడు ఏరియా కార్యదర్శులు, జి వెంకటేశ్వర్లు, ఎస్ ఎ గౌస్, జి వి కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం వారు కందుకూరు సుందరయ్య భవన్‌లో వారు విలేకర్లతో మాట్లాడారు. ప్రాజెక్టులో 20 అడుగులు నీళ్ల ఉన్నప్పటికీ పొలాల్లోకి చుక్కనీరు రాని కారణంగా నార్లు పోతున్నాయన్నారు. ప్రాజెక్టు గేటు మరమ్మతు విషయంలో ఆలస్యం జరుగుతుందన్నారు. ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా వెంటనే రాళ్లపాడు నుంచి నీరు విడుదలకు చర్యలు సిపిఎం నియోజకవర్గ నాయకులు ముప్పరాజు కోటయ్య, జి వెంకటేశ్వర్లు, ఎస్ ఎ గౌస్, జీవి బి కుమార్, మాదాల రమణయ్య, మద్దిశెట్టి జాలయ్య, ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

రైతులను ఆదుకోవాలి : బుర్రా

ఉన్నత స్థాయి అధికారులు స్పందించి రాళ్లపాడు ఆయకట్టు పరిధిలో వరినారు మళ్ల ఎండిపోకుండా తక్షణమే నీరు అందించేందుకు చర్యలు తీసుకుని రైతులను ఆదుకోవాలని కందుకూరు వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బుర్రా మధుసూదన్ యాదవ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రాజెక్టులో ఇప్పటికే 20 అడుగులు నీళ్లు చేరి నిండుకుండలా ఉన్నప్పటికీ పొలాల్లోకి చుక్కనీరు రాని కారణంగా నార్లు ఎండి పోతున్నాయన్నారు. తక్షణమే ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా రైతాంగాన్ని ఆదుకోవాలన్నారు. లేదంటే ఆందోళన చేస్తామని హెచ్చరిం చారు.



మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

‘రాళ్లపాడు’ను నిర్లక్ష్యం చేసింది వైసిపినే..

రాళ్ళపాడు ప్రాజెక్టు కుడి కాలువ గేటు గత 5 ఏళ్ల వైసిపి హయాంలో కనీస మరమ్మత్తులు లేక విరిగిపోతే ప్రతి దాన్ని రాజకీయం చేద్దాం.. ప్రభుత్వానికి చెడ్డపేరు తెద్దాం అనే విధంగా వైసిపి వ్యవహరిస్తున్నారని, రైతులు కష్ట కాలంలో ఉన్నప్పుడు వారికి అండగా నిలవాల్సింది పోయి ప్రతిదాన్నీ రాజకీయం చేయడం సిగ్గుచేటని తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెజవాడ ప్రసాద్ అన్నారు.మంగళవారం ఆయన మాట్లాడారు.

ఐటిడిఎ కార్యాలయం ఎదుట

అవుట్ సోర్సింగ్ టీచర్ల ధర్నా

సిపిఎం నగర కమిటీ సంఘీభావం

ప్రజాశక్తి-నెల్లూరు : గిరిజన గురుకులాల్లో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ టీచర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గడిచిన నెల రోజుల నుంచి విధులను బహిష్కరించి సమ్మె చేస్తుంటే ప్రభుత్వం స్పందించకపోవడాన్ని నిరసిస్తూ ఐటిడిఎ కార్యాలయం ఎదుట టీచర్లు, విద్యార్థుల తల్లిదండ్రులు సామూహిక నిరసన, ధర్నా చేపట్టారు. సోమవారం నగరం లోని స్థానిక కొండాయపాలెం గేట్ సెంటర్ నుండి సమగ్ర గిరిజనాభివద్ధి సంస్థ (ఐటీడీఏ) కార్యాలయం వరకు గిరిజన గురుకులాల టీచర్లు విద్యార్థుల తల్లిదండ్రులు ర్యాలీ నిర్వహించారు. ఐటిడిఎ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ మద్దతు తెలిపిన సిపిఎం నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు, గిరిజన విద్యార్థుల తల్లిదండ్రులు మీడియాతో మాట్లాడారు.. ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి పరిమళ తో ఫోన్లో సంప్రదించి అసిస్టెంట్ ప్రాజెక్ట్ అధికారికి వినతి పత్రం సమర్పించారు. యుటిఎఫ్ జిల్లా నాయకులు డి.ప్రభాకర్, పి డి ఎస్ యు జిల్లా నాయకులు సునీల్, మహిళా సంఘం నాయకులు కత్తి పద్మ, టి.శివకుమారి పాల్గొన్నారు.



మున్సిపాలిటీ అనుమతిలేకుండా

కాంప్లెక్స్ భవనంపై హోర్డింగ్ ఏర్పాటు

ప్రజాశక్తి-కందుకూరు : కందుకూరు మున్సిపాలిటీ అనుమతి లేకుండా మున్సిపాలిటీ షాపులపైనే ఏకంగా ఓ అధికార పార్టీ నేత హోర్డింగ్ నిర్మించడం చర్చినీయాంశంగా మారింది. ఆదివారం సెలవు రోజు చూసుకుని పర్మినెంట్ హోర్డింగ్ నిర్మాణానికి పూనుకున్నాడు ఆ నాయకుడు.మున్సిపాలిటీ అనుమతి లేకుండా ఇంతటి సాహసం చేయడంపై పలు విమర్శలు వినిపిస్తున్నాయి. కమిషనర్‌కు ఈ విషయం చెప్పినా పట్టించుకోలేదని తెలిసింది. తాను అధికారపార్టీ కదా తనను ఎవరేమి చేస్తారులే ధీమాలో అది ఏర్పాటు చేసినట్లు ఉంది.ఆ కాంప్లెక్స్‌కి నాలుగు అడుగుల దూరంలో మున్సిపాలిటి నిర్మించిన ఒ వ్యాపార గదిని ఓ వ్యక్తి ఆక్రమించి తనదంటున్న పరిస్థితి. కందుకూ రులో లక్షలు ఖర్చు చేసి నిర్మించిన గది తనదంటూ ఓ ప్రయివేటు వ్యక్తి కోర్టుకి వెళితే ఎమిచేయలేక ఉండిపోవాల్సిన పరిస్థితి.అదేపరిస్థితి హోర్డింగ్ విషయంలో జరగదని చెప్పలేము. మున్సిపాలిటీ అధికారులు స్పందిచాల్సిన అవసరముంది.



కందుకూరు మున్సిపల్ కాంప్లెక్స్‌పై ఎర్పాటు చేస్తున్న హోర్డింగ్ ఇదే..

నవనీతమ్మకు నివాళి

ప్రజాశక్తి-కందుకూరు : కందుకూరులో సోమవారం జరిగిన నవనీతమ్మ టీచర్ సంస్మరణ సభలో ఆమె సహాధ్యాయులు, పూర్వ విద్యార్థులు, శిష్యులు పాల్గొని ఘనంగా నివాళులర్పించారు. టీచర్ సహాధ్యాయి దండోరా ఏసుదాసు, ప్రియ శిష్యులు బండి గోవిందయ్య, అమెరికా లో స్థిరపడిన శిష్యుడు ఇన్నమూరి చక్రపాణి, డాక్టర్ తన్నీరు మల్లికార్జున, హిందీ పండిట్ బాల క్రిష్ణ, రెడ్ క్రాస్ చైర్మన్ రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

కోర్టు కేసుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి



ప్రజాశక్తి-నెల్లూరు : వివిధ ప్రభుత్వ శాఖల్లో కోర్టు కేసుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ ఒ.ఆనంద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ హాల్లో పిజిఆర్ఎస్ అర్జీల పురోగతి, వివిధ శాఖల్లో పలు సమస్యలపై కోర్టు కేసులు, గృహ నిర్మాణాల్లో పురోగతి, ఉపాధిహామీ పనిదినాల పెంపు, ప్లాంటేషన్, పంచాయతీరాజ్ సిసిరోడ్ల గ్రౌండింగ్ మొదలైన అంశాలపై సబ్‌కలెక్టర్లు, ఆర్‌డిఒలు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపిడిఒలు, తహశీల్దార్లతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రెవెన్యూ శాఖలో కోర్టు కేసుల పరిష్కారంపై కిందిస్థాయి సిబ్బందికి పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. కేసు పూర్వపరాలను క్షుణ్ణంగా పరిశీలించి సకాలంలో న్యాయస్థానాల్లో కౌంటర్లు దాఖలు చేయాలని అధికారులను ఆదేశించారు. కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను అమలు చేసే విషయంలో నిర్లక్ష్యం తగదని సూచించారు. నెలకు ఒకసారి మండల పరిధిలో ఒక గ్రామంలో సివిల్ రైట్స్ డేను నిర్వహించాలని ఆదేశించారు. ప్రతి సోమవారం నిర్వహిస్తున్న పిజిఆర్ఎస్‌లో వచ్చే అర్జీలను నిర్దిష్ట గడువులోగా పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. అదేవిధంగా హౌసింగ్‌లో స్టేజ్ కన్వర్షన్లపై దృష్టి పెట్టాలని, కంప్లీషన్ దశలో ఉన్న ఇళ్లపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి పూర్తి చేయాలన్నారు. ఉపాధి హామీ పని దినాలు పెంచాలని, అలాగే నరేగా పనుల్లో ప్లాంటేషన్ ఫిట్టింగ్, క్యాటిల్ షెడ్స్ పూర్తి చేయడానికి చర్యలు చేపట్టాలన్నారు. అలాగే అంగన్‌వాడీల్లో మంచినీటి వసతి సౌకర్యం, టాయిలెట్ల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. పంచాయతీరాజ్ ఆధ్వర్యంలో గ్రామాల్లో సిసిరోడ్లను వెంటనే గ్రౌండింగ్ నూరుశాతం పూర్తి చేయాలని ఆదేశించారు. గ్రామ వార్డు సచివాలయం పరిధిలో హౌస్ హోల్డ్ సర్వే, ఎంఎస్ఎంఇ సర్వే, లిటరేసి సర్వేను పూర్తి చేసేందుకు ఎంపిడిఒలు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్సులో జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్, డిఆర్ఒ ఉదయభాస్కర్, జిల్లా పంచాయతీ అధికారి శ్రీధర్ రెడ్డి, జెడ్‌పి సిఇఒ విద్యారమ, హౌసింగ్, డ్వామా పిడిలు వేణుగోపాల్, గంగా భవాని, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇలు అశోక్‌కుమార్, వెంకటరమణ, డిఇఒ బాలాజీ రావు, సమగ్ర శిక్ష ఎపిసి ఉషారాణి, తదితరులు పాల్గొన్నారు.

సిసిరోడ్డు ప్రారంభం



ప్రజాశక్తి-బిట్రగుంట : బోగోలు పంచాయతీలో అరవపాలెంలో మండల టిడిపి అధ్యక్షుడు మాలేపాటి నాగేశ్వరరావు, మాజీ ఎంపిటిసి చిలకపాటి వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో సోమవారం ఎన్ఆర్‌జిసి రూ.4లక్షల నిధులతో సిమెంట్ రోడ్డును ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంఎల్ఎ కావ్య క్రిష్ణారెడ్డి ఆదేశాల మేరకు బోగోలు పంచాయతీలో పెండింగ్‌లో ఉన్న సిమెంట్ రోడ్లు, డ్రైయినేజీ, ఎలక్ట్రికల్ అన్ని పనులను త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గడిచిన ఐదు సంవత్సరాల వైసిపి ప్రభుత్వ పాలనలో బోగోలు పంచాయతీ అభివృద్ధిలో కుంటుపడిందన్నారు. ఎంఎల్ఎ ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానాన్ని ఒక్కొక్కటిగా పూర్తి చేస్తున్నారన్నారు. టిడిపి నాయకులు బోగిరి ప్రభాకర్, నాగరాజు, ఎంపిటిసి స్వరూప, మాకా తదితరులున్నారు.

ప్రణాళికాబద్ధంగా చెత్తను సేకరించాలి



ప్రజాశక్తి-నెల్లూరు : నగరపాలక సంస్థ పరిధిలో బహిరంగ ప్రదేశాల్లో వ్యర్థాలు వేయకుండా, గార్బేజ్ పాయింట్లు ఏర్పడకుండా పర్యవేక్షించాలని, ప్రణాళికాబద్ధంగా ఇంటింటి నుంచి చెత్త సేకరణ జరపాలని కమిషనర్ సూర్యతేజ ఆదేశించారు. స్థానిక 2వ డివిజన్ పరిధిలోని 4 సచివాలయాలకు సంబంధించిన సిరి గార్డెన్, నరుకూరు, ఎస్.ఎల్.వి. రాయల్ ఎస్టేట్ తదితర ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణ పనుల పర్యవేక్షణలో భాగంగా కమిషనర్ సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరపాలక సంస్థకు చెందిన స్థలాల్లో పార్కుల నిర్మాణం కోసం జంగిల్ క్లియరెన్స్ చేయించాలని ఆదేశించారు. గుడిపల్లిపాడు ప్రాంతంలో ఓవర్‌హెడ్ వాటర్ ట్యాంక్ నుంచి స్థానికులందరికీ తాగునీటి కొళాయి కనెక్షన్లు వేగవంతం చేయాలని సూచించారు. నరుకూరు సమీపంలో అనధికార భవనం నిర్మాణం చేస్తుండటాన్ని గమనించిన కమిషనర్ విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు స్థానిక వార్డు సచివాలయ ప్లానింగ్ సెక్రటరీకి షోకాజు నోటీసు జారీ చేయమని ఆదేశించారు. గుడిపల్లిపాడు డ్రెయిను కాలువల నిర్మాణాలను వర్క్ ఆర్డర్ ఇచ్చినప్పటికీ మొదలుపెట్టని కారణంతో ఇన్‌ఛార్జ్ ఎ.ఇ.కి, స్థానిక వార్డు సచివాలయ అమెనిటీస్ కార్యదర్శికి షోకాజు నోటీసులు జారీ చేయాలని కమిషనర్ ఆదేశించారు. స్థానికంగా ఉన్న ప్రధాన పంట కాలువకు సంబంధించిన సమస్యలను పబ్లిక్ హెల్త్ ఎస్.ఇ. దృష్టికి తీసుకెళ్లి తగిన చర్యలు తీసుకోవాలని కమిషనర్ సూచించారు. పారిశుధ్య నిర్వహణ పనులను క్రమం తప్పకుండా నిర్వహించేలా సచివాలయ సిబ్బంది, అధికారులు పర్యవేక్షించాలని కమిషనర్ ఆదేశించారు. 2వ డివిజన్ కార్పొరేటర్ రామ్మోహన్, నగరపాలక సంస్థ ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ చైతన్య, ఇంజినీరింగ్ విభాగం, టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు, సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

మాజీ ఎంఎల్ఎ మేకపాటి పరామర్శ



మాట్లాడుతున్న మేకపాటి విక్రమ్‌రెడ్డి

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : మండలంలోని గండ్లవీడు, పడకండ్ల గ్రామాల్లో ఇటీవల కుటుంబ సభ్యులను కోల్పోయిన ఇరువురు కుటుంబాల వారిని సోమవారం మాజీ ఎంఎల్ఎ మేకపాటి విక్రమ్‌రెడ్డి పరామర్శించారు. పడకండ్ల గ్రామంలో వలంటీర్‌గా గతంలో విధులు నిర్వహిస్తూ మృతి చెందిన నిక్కం కార్తీక్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్తీక్ మృతికి గల కారణాలను అడిగి తెలుసుకుని కుటుంబసభ్యులకు ధైర్యం చెప్పారు. అదేవిధంగా గండ్లవీడు ఎస్‌సి కాలనీలో మొద్దు వెంకటయ్య ఇటీవల హఠాన్మరణం చెందడంతో వారి కుటుంబాన్ని మేకపాటి విక్రమ్ రెడ్డి పరామర్శించారు.

పడకండ్ల ఉపసర్పంచ్ తుమ్మల చెంచురామిరెడ్డి కుమారుడి వివాహం ఇటీవల కావడంతో వారి కుమారుడు తుమ్మల చంద్రారెడ్డి దంపతులను ఆత్మకూరు మాజీ ఎంఎల్ఎ మేకపాటి విక్రమ్ రెడ్డి ఆశీర్వదించారు. సోమవారం వారి నివాసానికి వెళ్లిన మాజీ ఎంఎల్ఎ మేకపాటి నూతన దంపతులను ఆశీర్వదించి అభినందనలు తెలిపారు. జెడ్‌పిటిసి పెమ్మసాని ప్రసన్నలక్ష్మి, జెసిఎస్ కన్వీనర్ వల్లభనేని రాజేంద్ర నాయుడు, వైసిపి నాయకులు గడ్డం శ్రీనివాసులరెడ్డి, బట్రెడ్డి జనార్ధన్ రెడ్డి, నాగులపాటి ప్రతాప్‌రెడ్డి, కొండా వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు నాయుడు, కౌన్సిలర్ కామాక్షయ్య నాయుడు, బొమ్మిరెడ్డి రవికుమార్ రెడ్డి, సర్పంచ్ వెంకటేశ్వర్లు తదితరులున్నారు.

వీడియోకాన్ఫరెన్స్‌కు అధికారుల డుమ్మా..



ప్రజాశక్తి-దగదర్తి : ప్రజలకు మంచి చేయాలని ఉద్దేశంతో ప్రభుత్వం ప్రతి సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా ఉన్నతాధికారులు అధికారులకు జరిగిన పనుల గురించి అడిగి తెలుసుకోవడం గాక జరగబోయే పనుల గురించి అనేక సూచనలను చేస్తారు అయితే వీడియో కాన్ఫరెన్సును మండలంలోని కొందరు అధికారులు డుమ్మా కొట్టడం ఆనవాయితీగా వస్తుంది. ఈ కార్యక్రమానికి ప్రాతినిధ్యం వహిస్తున్న ఎంపిడిఒ పట్టించుకోవడం గ్రామీణార్థం అధికారులు వీడియో కాన్ఫరెన్స్ హాజరు కాకపోవడం సంబంధిత కార్యాలయంలో అధికారులు అందుబాటులో లేకపోవడం ప్రజలు చాలా ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఇప్పటికైనా జిల్లా ఉన్నత అధికారుల దృష్టి సాధించి వీడియో కాన్ఫరెన్సుకు మండలంలోని ప్రతి అధికారి పాల్గొనే విధంగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

వార్షిక ఉత్సవాలు



ప్రజాశక్తి-మర్రిపాడు : మండలంలోని చుంచులూరు గ్రామంలో శ్రీ అంకమ్మ మల్లెం కొండేశ్వర స్వామి దేవస్థానం నిర్మించి రెండు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా సోమవారం వార్షిక ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నవగ్రహ పూజ, గణపతి హోమం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మంగళవారం పొంగళ్ళ కార్యక్రమం, సామూహిక విందు భోజన కార్యక్రమం నిర్వహించనున్నారు. కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పాల్గొని అంకమ్మ మరియు మల్లెంకొండేశ్వర స్వామివార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కోరెం మల్లికార్జున, సాంబయ్య, కొండలరావు, ఇంద్ర మధు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

అనిల్‌కు అభినందనలు



ప్రజాశక్తి-కలిగిరి : తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రెండు రాష్ట్రాలకు గాను కెఐఎఫ్ఎ అవార్డ్స్‌కు ఉత్తమ షార్ట్ ఫిలిమ్స్ డైలాగ్ రైటింగ్ కేటగిరిలో ఎంపికైన కలిగిరి మండలంకు చెందిన యువకుడు కోట.అనిల్ కుమార్ రెడ్డిని ఎంపిక చేశారు. అనిల్ ప్రతిభను గూర్చి వింజమూరు తాలూకా ఎపిఎన్‌జిఒఎస్ అధ్యక్షులు వెలుగోటి మధు భవిష్యత్తులో ఉత్తమ డైరెక్టర్లలో ఒకరిగా నిలవాలన్నారు. అనంతరం అనిల్‌ను సత్కరించారు.

పార్కుల నిర్వహణలో భాగస్వాములవ్వాలి



మాట్లాడుతున్న కమిషనర్ సూర్యతేజ

ప్రజాశక్తి-నెల్లూరు

నగరపాలక సంస్థ పరిధిలోని కార్పొరేషన్ ఖాళీ స్థలాలలో పార్కులను నిర్మించనున్నామని, వాటి నిర్వహణ కోసం స్థానిక కమిటీలు లేదా వ్యాపార సంస్థలు స్వచ్ఛందంగా బాధ్యతలు తీసుకునేలా భాగస్వామ్యం కావాలని కమిషనర్ సూర్యతేజ ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికను నెల్లూరు నగర పాలక సంస్థ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ విభాగం సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించారు. కమిషనర్ సూర్యతేజ పాల్గొని అర్జీదారుల నుంచి వినతి పత్రాలను స్వీకరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నెల్లూరు నగర పాలక సంస్థ పరిధిలోని స్థానిక సమస్యలను కమాండ్ కంట్రోల్ విభాగంలో ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్‌కి ఫోన్ ద్వారా తెలియజేస్తే తక్షణమే స్పందించి ఫిర్యాదును పరిష్కరించేందుకు కృషి చేస్తామని కమిషనర్ సూర్యతేజ తెలిపారు. ప్రజాసమస్యల పరిష్కార వేదికలో వివిధ అంశాలపై ప్రజల నుంచి అందుకున్న ఫిర్యాదులు పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం అందించాలని, వాటన్నింటికీ నిర్ణీత సమయంలోగా పరిష్కారం అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం విలేకరులతో కమిషనర్ మాట్లాడుతూ ఫిర్యాదుదారులు తమ సమస్యలను 9494018118 నెంబర్‌కు వాట్సాప్ ద్వారా లేదా 0861-2356777, 0861-2316777 హెల్ప్‌లైన్ నెంబర్లకు ఉదయం 6గంటల నుంచి సాయంత్రం 6గంటల లోపు తెలియజేయాలని కోరారు. అందుకున్న ఫిర్యాదులను కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా సంబంధిత అధికారులకు తెలియజేసి తక్షణమే సదరు సమస్యలు పూర్తి స్థాయిలో పరిష్కరించేందుకు చర్యలు చేపడతామన్నారు. విభాగాల వారీగా అకౌంట్ సెక్షన్ -1, ఇంజనీరింగ్ -19, హౌసింగ్ -2, పబ్లిక్ హెల్త్-2, టౌన్ ప్లానింగ్-8, మొత్తం 32 ఫిర్యాదులను అందుకున్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో నగర పాలక సంస్థ అదనపు కమిషనర్ నందన్, ఇంజనీరింగ్ ఎస్ఇ రామ్మోహన్‌రావు, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ చైతన్య, మేనేజర్ ఇనాయతుల్లా అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

18,19 తేదీల్లో సర్పంచ్‌లకు శిక్షణ



మాట్లాడుతున్న ఎఎస్‌పేట ఎంపిడిఒ ప్రసన్నకుమారి

ప్రజాశక్తి-అనంతసాగరం

మండల అభివృద్ధి కార్యాలయంలో 18, 19వ తేదీల్లో ఎల్‌డిజి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు సోమవారం ఎంపిడిఒ ఐజాక్ ప్రవీణ్ తెలిపారు. శిక్షణా తరగతులకు గ్రామ సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, మండల అధికారులు, డిజిటల్ అసిస్టెంట్లు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, ఎఎన్ఎంలు, మహిళా సంరక్షణ కార్యదర్శులు, విలేజ్ సర్వేయర్లు, గ్రామ రెవెన్యూ అధికారులు పాల్గొనాలని ఆయన తెలిపారు. సచివాలయంలో ఈ రెండు రోజులు అగ్రికల్చర్ అసిస్టెంట్, ఎనర్జీ అసిస్టెంట్ ఇద్దరు అందుబాటులో ఉండాలన్నారు. లేకపోతే ఫంక్షనరీ ఉంచి సచివాలయాన్ని తెరిచి ఉండాలని ఆయన తెలియజేశారు.

ప్రజాశక్తి-ఎఎస్‌పేట : మండల పరిధిలోని స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో 18, 19 తేదీలలో రెండు రోజులపాటు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ ప్రసన్న కుమారి తెలిపారు. ఆమె మాట్లాడుతూ ఈ శిక్షణ కార్యక్రమంలో గ్రామ పంచాయతీల్లో సుస్థిర లక్ష్యాలను సాధించుటకు గానూ, పంచాయతీ కార్యదర్శులకు, సచివాలయ సిబ్బందికి, మండల స్థాయి అధికారులకు, శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తామని, శిక్షణకు హాజరు కానున్న వారు తప్పనిసరిగా ఆధార్ కార్డు, ఆధార్ కార్డుకు లింక్ అయిన ఫోన్ నెంబరు తప్పనిసరిగా తీసుకుని రావాలని పత్రికాముఖంగా తెలియజేశారు.



కెవిపిఎస్ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేస్తున్న బాధితులు

నిందితులపై కేసు నమోదు చేయాలి

– కెవిపిఎస్ రాష్ట్ర కమిటీ సభ్యులు డిమాండ్

ప్రజాశక్తి-నెల్లూరు

నెల్లూరు పాతమిట్టపాళెం ప్రాంతానికి చెందిన దళిత రైతు దారా శివయ్యపై అక్రమంగా దాడులకు పాల్పడిన వారిపై పోలీసు కేసు నమోదు చేసి న్యాయం చేయాలని కెవిపిఎస్ రాష్ట్ర కమిటీ సభ్యులు గంపా సుధీర్ డిమాండ్ చేశారు. సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో బాధిత రైతు దారా శివయ్యకు జరిగిన అన్యాయాన్ని కెవిపిఎస్ రాష్ట్ర సభ్యులు గంపా సుధీర్ కలెక్టర్ దృష్టికి తీసు కెళ్లారు. అనంతరం బాధితుడితో కలిసి కెవిపిఎస్ నాయకులు మీడియాతో మాట్లాడుతూ నెల్లూరు రూరల్ మిట్టపాలెం సర్వే నెంబర్ 1026లో ఎ.1.65 సెంట్లు భూమి బాధితుడి తండ్రి దగ్గర నుండి సంక్రమించిందన్నారు. సదరు భూమిని 1968లో ప్రభుత్వం బాధితుడి తండ్రికి మంజూరు చేసిందన్నారు. నాటి నుంచి ఆ భూమిని బాధితుడి కుటుంబం అనుభవంలో ఉన్నదన్నారు. ఆ భూమిలో బాధితుడు వరిసాగు చేసుకుంటూ, కొన్ని పండ్లచెట్లను పెంచి, వాటి ద్వారానే జీవనం సాగిస్తున్నాడన్నారు. 2024 నవంబర్ 24న, డిసెంబర్ 8, 9 తేదీల్లో బీరద వోలు ప్రదీప్ రెడ్డి, బిరదవోలు శైలజ, మహేష్, శ్రీకాంత్ అనువారు మరికొంత మందితో ప్రొక్లేన్ తీసుకొచ్చి, 15 సంవత్సరాల నుండి పెంచుకున్న పండ్లచెట్లను పూర్తిగా నాశనం చేశారన్నారు. 12 సంవత్సరాల నుండి పెంచిన 4 కొబ్బరి చెట్లు, 8 సంవత్సరాల నుండి పెంచుతున్న 33జామ చెట్లు, 12 సంవత్సరాల నుండి పెంచిన 3 సపోట చెట్లు, 40 జామాయిల్ చెట్లు, 4 అరటి చెట్లు, 15సంవత్సరాల వయస్సు కలిగిన 2 నేరేడు చెట్లు,పెద్ద రేగు కాయల చెట్లు,ఒక చెర్రీపండ్ల చెట్టు, 2 మునగ చెట్లు ఉన్నాయని తెలిపారు. చుట్టూరా ఉన్న ఫెన్సింగ్ నాశనమైందన్నారు. ఒక ఎకరాలో పండించిన వరి ధాన్యానికి సంబంధించిన కుప్పను ప్రొక్లెయిన్ ద్వారా చెల్లా చెదురు చేశారని తెలిపారు. 3 సంవత్సరాల నుండి పెంచిన 40జామాయిల్ చెట్లను పొలంలో నిర్మించి ఉన్న వసారాను నేలమట్టం చేశారన్నారు. బాధితుడికి రూ.4 లక్షల వరకు నష్టం జరిగిందని, భూ ఆక్రమణ దారుల నుండి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతున్నట్లు తెలిపారు. బాధిత కుటుంబాన్ని బురదలోకి నెట్టివేసి, దాడి చేసి, కులం పేరుతో దూషించి, చంపుతామని బెదిరించి, వారిపై కేసు నమోదు చేసి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ



ప్రజాశక్తి-నెల్లూరు : జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా విద్యుత్ వినియోగ దారులకు అవగాహన కల్పించడానికి 20వ తేదీ వరకు విద్యుత్ పొదుపు వారోత్సవాలు జరుగుతాయని దానికి సంబంధించిన పోస్టర్లను, కరపత్రాలను ఆవిష్కరించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్, డిఆర్ఒ విజయ్‌భాస్కర్‌లు పాల్గొని ఆవిష్కరించారు. సూపరింటెండింగ్ ఇంజనీర్ వి.విజయన్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్స్ సోమశేఖర్ రెడ్డి, పరంధామయ్య, రమేష్ చౌదరి, శ్రీధర్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్స్ అశోక్, మధుసూదన్ రెడ్డి, సునీల్, కిరణ్, అసిస్టెంట్ ఇంజనీర్ సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

దినసరి కూలీలను రెగ్యులర్ చేయాలి




మాట్లాడుతున్న పెంచలనర్సయ్య

ప్రజాశక్తి-నెల్లూరు

కావలి మున్సిపాలిటీలో గత ఆరు సంవత్సరాల నుండి దినసరి కూలీలుగా పనిచేస్తున్న 60మంది కూలీలను రెగ్యులర్ చేయాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) డిమాండ్ చేసింది. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి హాజరైన యూనియన్ నాయకులు, దినసరి కూలీలు తమ సమస్యలను జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి తమకు న్యాయం చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ యూనియన్ జిల్లా కార్యదర్శి కె.పెంచలనరసయ్య మీడియాతో మాట్లాడుతూ కావలి మున్సిపాలిటీలో రోజువారీ వేతనంతో దాదాపు 60మంది పనిచేస్తున్నారన్నారు. కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి అతి తక్కువ జీతాలతో రోజువారి కూలీలుగా చేరి పనిచేస్తున్నారన్నారు. కరోనా సమయంలో అధికారులు వారిని ఆప్కాస్‌లో చేర్చి రెగ్యులర్ చేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఆరు సంవత్సరాల నుండి పనిచేస్తున్న వీరిని రెగ్యులర్ చేయలేదన్నారు. కావలి మున్సిపాలిటీలో కొత్తగా 40ఖాళీలు ఏర్పడ్డాయని, వాటి స్థానంలో దినసరి కూలీలుగా పని చేస్తున్న వారిని తీసుకోకుండా, కొత్తవారిని తీసుకునే ప్రయత్నాలు చేయడం సరికాదన్నారు. ఇక్కడ పనిచేస్తున్న కార్మికులు అందరూ దళితులు, పేద బడుగు, బలహీన వర్గాలకు చెందిన వారు. రెగ్యులర్ చేస్తారనే ఆశతో సంవత్సరాలు తరబడి పని చేస్తుంటే ఇప్పుడు అధికారులు కొత్తవారిని తీసుకునే ప్రయత్నాలు చేయడం దారుణమంటూ వాపోయారు. అదేవిధంగా 60 సంవత్సరాలు పైబడి పని చేస్తున్న కార్మికులను ఎటువంటి రిటైర్మెంట్ బెనిఫిట్స్ లేకుండా అర్ధాంతరంగా ఇళ్లకు పంపించడం దారుణమన్నారు. వారికి రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించి, వారి స్థానంలో వారసులకు ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ కావలి మున్సిపల్ అధ్యక్ష కార్యదర్శులు శ్రీనివాసులు, మహేష్, నాయకులు ప్రవీణ్, రాజా, ప్రభాకర్, హరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

స్కానింగ్ కేంద్రాల్లో తనిఖీలు



తనిఖీలు నిర్వహిస్తున్న కమిటీ సభ్యులు

ప్రజాశక్తి-నెల్లూరు

పిసి అండ్ పిఎన్‌డిటి చట్టం పటిష్టంగా అమలు చేయడంలో భాగంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎం.పెంచలయ్య ఆదేశాల మేరకు జిల్లా లేప్రోసి ఎయిడ్స్ క్షయ నివారణ అధికారి డాక్టర్ షేక్.ఖాదర్‌వలీ, జిల్లా మాస్ మీడియా అధికారి కె.కనకరత్నం నగరంలోని స్కానింగ్ కేంద్రాలు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. సోమవారం నగరంలోని శ్రీ దుర్గా హాస్పిటల్, శ్రీనివాస స్కాన్ సెంటర్, అపోలో హాస్పిటల్, నారాయణ హాస్పిటల్, మెడికోవర్ హాస్పిటల్‌లను ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. సదరు అధికారులు స్కానింగ్ కేంద్రాలను సందర్శించి పలు రికార్డులు, నివేదికలు ఫామ్ -ఎఫ్‌లను పరిశీలించారు. ఈ సంధర్భంగా అదనపు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి / జిల్లా లేప్రోసి ఎయిడ్స్ క్షయ నివారణ అధికారి డాక్టరు షేక్.ఖాదర్‌వలీ మాట్లాడుతూ స్కానింగ్ కేంద్రాల నిర్వాహకులు ఎట్టి పరిస్థితుల లోనూ లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించరాదని, అలా చేస్తే గర్భస్థ లింగ నిర్ధారణ నిషేధ చట్టం పిసి అండ్ పిఎన్‌డిట చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. స్కానింగ్ కేంద్రాల నిర్వహకులకు పిసిఅండ్ పిఎన్‌డిటి చట్టం, నియమ నిబంధనలపై అవగాహన కల్పించారు. స్కానింగ్ కేంద్రాల్లో ప్రతిఒక్కరూ ధరలు పట్టికను ప్రదర్శించాలని ఆదేశించారు. స్కానింగ్ పరీక్షలు నిర్వహించిన ప్రతి గర్భిణుల వివరాలను సంబంధిత ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయాల్సిందిగా ఆదేశించారు. స్కానింగ్ చేసిన గర్భిణీ వివరాలను ఆన్‌లైన్లో నమోదు చేయని యజమాన్యాలపై చట్టపరమైన చర్యలు తీసుకొంటామన్నారు. జిల్లా కోఆర్డినేటర్ (క్షయ) విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

అమరజీవికి భారతరత్న ఇవ్వాలి

ప్రజాశక్తి-కావలి : అలుపెరగని సంఘ సేవకుడు ఆదర్శ గాంధేయవాది అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములుకు కేంద్ర ప్రభుత్వం "భారతరత్న" పురస్కారాన్ని అందజేయాలని ఎం.మాలకొండా రెడ్డి అన్నారు. అమరజీవి 73వ వర్ధంతి సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ప్రజాస్వామ్యవాదులు అమరజీవి ఆశయాలను కొనసాగించాలని కోరారు.

విద్యుత్ ఛార్జీలను తగ్గించాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ప్రజాశక్తి-అనంతసాగరం

పెరిగిన విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని, స్మార్ట్ మీటర్‌లను రద్దు చేయాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ కార్యాలయం వద్ద నిరసన తెలిపి విద్యుత్ ఎఇకి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి అన్వర్ బాషా మాట్లాడుతూ పెరిగిన విద్యుత్ ఛార్జీలు పెరగడంతో ప్రజలు విద్యుత్ బిల్లులు కట్టలేక ఇబ్బందులు పడుతున్నారు. విద్యుత్ ఛార్జీలు పెంచమని, తగ్గిస్తామని ఎన్నికల్లో టిడిపి కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చిందని తెలిపారు. స్మార్ట్ మీటర్‌లు వద్దని, పెడితే పగలగొట్టమని చెప్పిన ప్రతిపక్షంలో ఉండగా టిడిపి కూటమి నేతలు అధికారంలోకి రాగానే మాట తప్పి రూ.15,484 కోట్ల సర్దుబాటు ఛార్జీల భారాన్ని ప్రజలపై మోపి డిసెంబర్ నుండి పెంచిన విద్యుత్ బిల్లులు వసూలు చేస్తున్నారని తెలిపారు. పాత విద్యుత్ మీటర్‌లు తొలిగించి ఆదాని వారి స్మార్ట్ మీటర్‌లు బిగిస్తున్నారన్నారు. ఈ మీటర్ ద్వారా గంటగంటకు రీడింగ్ లెక్కిస్తారని తెలిపారు. సాయంత్రం 6గంటల నుండి విద్యుత్ ఎక్కువగా వాడే సమయంలో పగలు కంటే రాత్రికి రేటు ఎక్కువ ఛార్జీలు వసూలు చేస్తారన్నారు. ప్రజలను పీల్చి పిప్పి చేయడానికే స్మార్ట్ మీటర్‌లు బిగిస్తున్నారని విమర్శించారు. విద్యుత్ సంస్థను కార్పొరేట్ మోసగాడు అదానీకి అప్పగించడానికి కేంద్ర ప్రభుత్వం ప్రయత్నం చేస్తుందని దానికి అధికారంలో ఉన్న చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్, ప్రతిపక్షంలో ఉన్న జగన్‌మోహన్ రెడ్డి సహకరిస్తున్నారన్నారు. అటు విద్యుత్ ఛార్జీల పెంపు, ఇటు స్మార్ట్ మీటర్‌లతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నారని తెలిపారు. అందుకే పార్టీలకు అతీతంగా ప్రజలు ఏకమై ప్రభుత్వాలను నిలదీయాలన్నారు. స్మార్ట్ మీటర్లు బిగించడం ఆపాలని, పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని సిపిఎం డిమాండ్ చేస్తోందని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం శాఖ సభ్యులు ఎస్‌డి సంధాని, ఫక్రూస, బాబు, కరీం, గిరిజన శాఖ కార్యదర్శి నాగులురూ వెంకటేష్, రమేష్, మస్తాన్, జలీల్, షాహుల్, తదితరులు పాల్గొన్నారు.



గణితం పరీక్ష వాయిదా..

- ఎంఇఒ తోట శ్రీనివాసులు వెల్లడి

ప్రజాశక్తి-ఉదయగిరి : మండలంలోని గండిపాలెం గురుకుల పాఠశాల ప్రాథమిక ప్రాథమికోన్నత ఉన్నత పాఠశాలలో జరుగుతున్న స్వయం మదింపు పరీక్షల్లో భాగంగా గణితం పరీక్ష పత్రం లీక్ అవ్వడం వల్ల పరీక్ష వాయిదా వేసినట్లు ఎంఇఒ తోట శ్రీనివాసులు సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తదుపరి గణితం పరీక్ష తేదీ ప్రకటిస్తామన్నారు. విద్యాశాఖ ఆదేశాల మేరకు సైన్స్, సోషల్ ప్రశ్నా పత్రాలను స్థానిక పోలీస్ స్టేషన్‌కు అప్పగించామన్నారు. పరీక్ష పత్రాలు సిబ్బంది లీక్ చేసేందుకు ప్రయత్నిస్తే శాఖపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రాథమికోన్నత ఉన్నత పాఠశాల సిబ్బంది గమనించగలరని ఆయన సూచించారు.

కావలిలో క్రీడాపోటీలు



ప్రజాశక్తి-కావలి : నెల్లూరు నెహ్రూ యువ కేంద్రం, ప్రియదర్శిని మహిళా మండలి, రహీం చారిటబుల్ ట్రస్ట్, వి సేవా ఫౌండేషన్, గుడ్‌మెన్స్ చారిటబుల్ ట్రస్ట్ (బ్లడ్ వారియర్స్ టీం) సంయుక్త ఆధ్వర్యంలో బ్లాక్ లెవెల్ క్రీడా పోటీలను సోమవారం కావలి జిల్లా పరిషత్ హైస్కూల్ క్రీడాప్రాంగణంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మున్సిపల్ కమిషనర్ జి.శ్రావణ్‌కుమార్, ఎంఇఒ-2 వెంకటసుబ్బయ్య విచ్చేశారు. పురుషులకు వాలీబాల్, 100 మీటర్స్ పరుగు పందెం, షాట్‌పుట్ నిర్వహించారు. స్త్రీలకు ఖోఖో, 100 మీటర్స్ రన్, షాట్‌పుట్ పోటీలను నిర్వహించారు. విజేతలకు ప్రశంసా పత్రాలు, మెడల్స్, మెమోంటో ట్రోఫీలను అందజేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశిస్తూ నెహ్రూ యువకేంద్ర జిల్లా యువజన అధికారి ఎ.మహేంద్ర రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ క్రీడాస్ఫూర్తిని కలిగి ఉండాలని, ఆరోగ్యానికి క్రీడలు ఎంతో దోహదపడతాయని ప్రతిఒక్కరూ రోజు కనీసం ఒక గంట ఆడుకోవాలని తెలిపారు. క్రీడల వల్ల శరీరిక దృఢత్వంతో పాటు మానసిక దృఢత్వం పెరుగుతుందని అలాగే నాయకత్వ లక్షణాలు పెరుగుతాయని విద్యార్థులకు తెలియజేశారు. డిసెంబర్ 18వ తేదీ కందుకూరు పట్టణంలో, 21వ తేదీ నెల్లూరు పట్టణంలో ఆటల పోటీలు నిర్వహిస్తున్నామని తెలియజేశారు. గెలుపొందిన వారు జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. ఆసక్తి కలిగిన యువత కింది నెంబర్‌కు 9963533440 సంప్రదించాల్సిందిగా తెలిపారు. ఈ పోటీలకు 15 నుండి 29 సంవత్సరాల లోపు జిల్లా వాసులైన ప్రతి ఒక్కరూ అర్హులు అని అన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ హైస్కూల్ క్రీడోపాధ్యాయుడు చిరంజీవి, వివిధ విద్యా సంస్థల క్రీడోపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై శిక్షణ



మాట్లాడుతున్న ఎంపిడిఒ ఐజాక్‌ప్రవీణ్

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

మండలంలోని మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఎంపిడిఒ ఐజాక్‌ప్రవీణ్ ఆధ్వర్యంలో సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపై సర్పంచ్‌లకు, మండల అధికారులకు, పంచాయతీ కార్యదర్శులకు, సచివాలయ ఉద్యోగులకు జరుగుతున్న రెండు రోజుల శిక్షణా తరగతుల కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ సమాజంలో బహుముఖ రంగాలలో పేదరికాన్ని రూపుమాపడానికి సమానమైన, న్యాయమైన, సురక్షితమైన మౌలిక సదుపాయాలను అందరికీ అందించే లక్ష్యంగా ఈ సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు రూపొందించబడ్డాయన్నారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఎఇ ఖాదర్ మస్తాన్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని సమస్యలు ప్రజాప్రతినిధులు, అధికారులు ఒకరికొకరు సమన్వయంగా కనీస మౌలిక సదుపాయాలుగా అందరికి తాగునీటి వసతి కల్పించడం, పారిశుధ్యాన్ని పెంపొందించే దిశగా సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు సాధించడానికి కృషి చేయాలని తెలిపారు. ఎంఆర్‌సి బ్రహ్మయ్య మాట్లాడుతూ స్వచ్ఛభారత్‌లో భాగంగా మండలంలో 82 మరుగుదొడ్లు మంజూరు చేశారని, ప్రతి గ్రామం బహిరంగ మల విసర్జిత రహిత గ్రామంగా రూపొందాలని కోరారు. ఎంపిడిఒతోపాటు ఇఒపిఆర్‌డి డేవిడ్, ఎఇ శ్రీనివాసులు, అన్నిగ్రామాల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, వెలుగు ఎపిఎం, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, హెల్త్ అసిస్టెంట్లు, సచివాలయ ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.



కమ్యూనిటీ హాల్ నిర్మిస్తాం..

ప్రజాశక్తి-కావలి

దివ్యాంగులకు కమ్యూనిటీ హాల్ ఒకటి నిర్మించి ఇస్తానని ఎంఎల్ఎ దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి తెలిపారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవంలో భాగంగా నిర్వహిస్తున్న వారోత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. దివ్యాంగుల సమస్యలను ఆయన తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దివ్యాంగులందరికీ ఇంటి స్థలం, పెన్షన్ అందేలా చూస్తామని తెలిపారు. విడతల వారీగా కాలనీలోని ప్రతి రోడ్డును సిసి రోడ్లుగా మారుస్తామని, కరెంటు సరఫరాను మెరుగుపరుస్తామని తెలిపారు. దివ్యాంగులందరికీ వారు నివసించే గ్రామాల్లోనే ఇళ్ల స్థలాలు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో దివ్యాంగుల నాయకుడు మండవ వెంకట్రావు, కావలి ఒకటవ పట్టణ ఎస్ఐ సుమన్, టిడిపి నాయకులు శివ, దివ్యాంగుల నాయకులు మహబూబ్ బాషా, మాలకొండయ్య, సుబ్రహ్మణ్యం, కోడూరు సోమయ్య, ఆదోని రమణయ్య, శెట్టిపల్లి రామయ్య, మాధవరావు, తల్లిబోయిన శ్రీనివాసులు, శంకర్ రాజు, మరియమ్మ, కొండూరు పోలమ్మ భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.



తహశీల్దారు దాతృత్వం

ప్రజాశక్తి-దుత్తలూరు : మండలంలోని నర్రవాడ గ్రామంలో ఉన్న ఎస్‌టి కాలనీని సోమవారం స్థానిక తహశీల్దార్ వై.నాగరాజు సందర్శించారు. ఈ సందర్భంగా వారికి చలి తీవ్రతను బట్టి ఎస్‌టి కాలనీలోని కాలనీ వాసులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ మేరకు తమ సొంత ఖర్చులతో వారికి సహాయం చేసి దాతృత్వం చాటుకున్నారు. ఒక్కో కుటుంబానికి రెండేసి చొప్పున 40 కుటుంబాలకు దుప్పట్లు ఇచ్చారు. ఈ సందర్భంగా కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు.

'భోగినేని'కి మాతృవియోగం




ప్రజాశక్తి- ఉలవపాడు

ఉలవపాడు గ్రామానికి చెందిన ఎన్.ఐ.ఆర్. భోగినేని చెంచు రామనాయుడు తల్లి సరోజినమ్మ మృతి చెందారు. ఆమె మృతిపై కందుకూరు మాజీ ఎంఎల్ఎ డాక్టర్ దివి శివరాం రామానాయుడును పరామర్శించి సరోజనమ్మ మృతదేహానికి నివాళు లర్పించి కుటుంబ సభ్యులను ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయనవెంట పెద్దినేని.కొండప నాయుడు, మాజీ సి.హెచ్.సి. చైర్మన్ దార్ల మల్లికార్జున, మాజీ జిల్లా కోఆప్షన్ సభ్యులు ఎస్.కె. బాజీ, ఎస్‌సిసెల్ జంగాల శివప్రసాద్, వెలిచెర్ల శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే లక్ష్యం

ప్రజాశక్తి-దుత్తలూరు

రాష్ట్రంలో ఉన్న ప్రతి రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఉదయగిరి మాజీ శాసన సభ్యులు కంభం విజయరామిరెడ్డి అన్నారు. ఇటీవల కురిసిన ఫెంగల్ తుపాన్ కారణంగా శనగపంట పండించే రైతులు తీవ్రంగా నష్టపోవడంతో ప్రభుత్వం 80శాతం సబ్సిడితో అందించిన శనగలను మాజీ శాసనసభ్యులు కంభం విజయరామిరెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తుందన్నారు. తుపాన్ ప్రభావంతో రైతులు నష్టపోగా వారికి ఆసరాగా నిలుస్తూ తిరిగి పంటలను సాగు చేసుకునేలా విత్తనాలను అందించడం ఆనందదాయకమన్నారు. కార్యక్రమంలో ఎడిఎ చెన్నారెడ్డి, మండల వ్యవసాయాధికారి ఎన్.వెంకటసుబ్బారెడ్డి, ఎఇఒలు, విఎఎలు, రైతులు పాల్గొన్నారు.



నిత్యావసరాలు వితరణ

ప్రజాశక్తి-బిట్రగుంట

ఆదరణ కేంద్రానికి రూ.20వేల విలువ చేసే నిత్యావసరాలను కాండ్ర సతీష్ వితరణగా సోమవారం అందజేశారు. గత మూడు సంవత్సరాల కాలంగా ఇచ్చిన హామీ ప్రకారం క్రమం తప్పకుండా అందజేస్తున్నారు. ఆదరణ కేంద్రం డైరెక్టర్ డాక్టర్ కె సింహాద్రి రావు మాట్లాడుతూ సతీష్ అందిస్తున్న సహాయం ప్రశంసనీయమని, శాశ్వత డోనర్‌గా ఆదుకుంటున్నందుకు ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో ఆదరణ కేంద్రం డైరెక్టర్ భవాని, తదితరులు పాల్గొన్నారు.